# నిన్నుగూర్చి నీవు మరచిపో (4:8-14)

''సాతాను నిన్ను కష్టపెట్టినప్పుడు'' అనే అంశంమీద గత పాఠాన్ని చదివాం. 1వ వచనంనుండి 7 వచనంవరకు ఈ క్రింది సలహాలను బయటికి లాగాం: (1)ఆశ్చర్యపడకండి, (2) నిరాశపడకండి, (3) అపవాది చట్టాలను అనుసరించ కండి. ఇకపోతే 8నుండి 14వచనాలవరకు, సభవారి యెదుట తాము చేసింది న్యాయమని పేతురు తెలిపిన సంగతులను ఆలోచన చేద్దాం. పేతురు మాటల్లో ఒక సూత్రం ప్రకాశవంతంగా కన్పిస్తుంది: ''తనకంటెను పేతురు క్రీస్తునుగూర్చి, ఆయన సువార్తనుగూర్చి ఎక్కువ అక్కర కలిగియున్నాడు'' - అనేదే!

## ఆత్మ

పేతురు తన పక్షంగా మాటలాడ బూనినప్పుడు, ''పరిశుద్ధాత్మతో నిండినవాడై'' అని వ్రాయబడియుంది (8a వ.). చెరసాలలో వేయబడుదురని ప్రభువు తన శిష్యులను హెచ్చరించినప్పుడు, ''మేమేమి సమాధానము చెప్పుదుమా అని ముందుగా చింతింపకుందుమని మీ మనస్సులో నిశ్చయించుకొనుడి. మీ విరోధు లందరు ఎదురాడుటకును, కాదనుటకు వీలుకాని వాక్కును, జ్ఞానమును నేను మీకు అనుగ్రహింతును'' (లూకా 21:14-15).[1] పేతురు ఆ రాత్రి చెరసాలలో ఎలా గడిపాడో తెలియదుగాని,[2] తన పక్షంగా మాట్లాడ బోయే దానినిగూర్చి సిద్ధపడలేదని మాత్రం నాకు తెలుసు. పరిశుద్ధాత్మతో నిండుకొని యుండడమంటే - పరిశుద్ధాత్మ స్వాధీనంలో ఉండడమని భావం. యేసుయొక్క ఆత్మ తనద్వారా సెన్‌హెడ్రిన్‌తో మాట్లాడబోతాడు.[3]

## అంశం

సభవారు అడిగిన ప్రశ్న (ఏ బలము శక్తిచేత ఏ నామమును బట్టి దీన్ని మీరుచేశారు?) అనేది! అది అనిశ్చయమైన ప్రశ్నయైనా, తన అంశాన్ని ఎత్తుకొనడానికి పేతురుకు అనుకూలమైన సాధనంగా ఉంది. ఆత్మచేత నడిపింపబడినవాడై, ''దీనిని'' అనే మాటను స్పష్టతకు వర్తింపజేసి, తన సమాధానాన్ని పేతురు యిలా ప్రారం భించాడు: ''...ప్రజల అధికారులారా, పెద్దలారా, ఆ దుర్బలునికి[4]

చేయబడిన ఉపకారమునుగూర్చి వాడు దేనివలన స్వస్థత పొందెనని నేడు మమ్మును విమర్శిం చుచున్నారు ...'' (8b - 9 వచ.). ''ఈ మనుష్యునికి'' అని పేతురు అన్నప్పుడు, వాని భుజంమీద చేయివేసియుండవచ్చు. వాడు వారి ప్రక్కనే ఉన్నాడు (14 వ.). పరిస్థితి మాత్రం అసంబద్ధంగాను, పరిహసింపదగినట్టుగాను ఉంది! పేతురుకు అది తెలుసు! సభవారికికూడా తెలుసు. సభవారికి గత్యంతరంలేదు.

## రక్షకుడు

''అతని స్వస్థపరచిందెవరో నిజంగా మీరు తెలిసికోగోరితే, నేను మీకు తెలుపుతాను'' అన్నట్టు పేతురు అన్నాడు. ''ఎవరి నామమున మీరు దీనిని చేశారని'' వారడిగారు. ''యేసు నామమున ఆ మనుష్యుడు స్వస్థతపొందినట్టు పేతురు వారికి తెలిపాడు:''

> మీరందరును ఇశ్రాయేలు ప్రజలందరును తెలిసికొనవలసిన దేమనగా మీరు సిలువవేసినట్టియు, మృతులలోనుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసుక్రీస్తు నామముననే వీడు స్వస్థతపొంది మీయెదుట నిలుచుచున్నాడు (10 వ.).

పేతురు తన జీవితాన్నిగూర్చి లక్ష్యపెట్టడంలేదు. తన క్షేమం కొరకు తాను విచారించినవాడై యున్నట్టయితే, దేశంలోని మహాబలమైన అధికారవర్గంవైపు తన వ్రేలు చూపి, మీరు మెస్సీయాను సిలువవేశారని వారిపై నేరస్థాపన చేయవల్లపడదు! పేతురు దేనివిషయమై అక్కర కలిగియున్నాడు? యేసు నామాన్నిగూర్చి అతడు అక్కర కలిగియున్నాడు!

సాతాను మనలను శ్రమపెట్టినప్పుడు, మనం గుర్తుంచుకోవలసిన అతి ప్రాముఖ్యమైన విషయం: మనకు ఏమి సంభవింపబోతుందనేది అల్పవిషయం, కాని మన ప్రభువుయొక్క పనికి ఏమి సంభవించ బోతున్నదనేదే ముఖ్యం.[6]

''దేవుడు (యేసును) మృతులలోనుండి లేపెను'' అనే వాస్తవాన్ని పేతురు స్థిరంగా స్థాపించబూనాడు. ''యేసునుబట్టి మృతులలోనుండి పునరుత్థానం'' కలుగుతుందన్న సమాచారాన్నిబట్టే సద్దూకయ్యులు కలవరపడిన సంగతి జ్ఞాపకం చేసికో (2 వ.). తన శ్రోతలు వినవలసిన అవసరం ఉన్నప్పుడు వివాదాస్పదమైన అంశాన్ని మాట్లాడ కుండ పేతురు నిలుపుచేయలేదు!

## రాయి

తాను చేయబూనిన నేరస్థాపనను పేతురు ముగించలేదు. దైవతత్వశాస్త్రవేత్తల యెదుట విద్యలేని పామరుడైయుండిన ఆ జాలరి లేఖనాలను వివరించడానికి సాహసించాడు: ''ఇల్లుకట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే; ఆ రాయి మూలకు తలరాయి ఆయెను'' (11 వ.). కీర్తనలు 118:22 మెస్సీయాకు

సంబంధించిన లేఖన భాగాల్లోనుండి పేతురు వారికి దీన్ని ఎత్తిచూపాడు.[7] ఈ ప్రవచన భాగం వ్యక్తిగతంగా ఆ సభవారికే చెందినట్లు, ‘‘మీరు’’ అనే పదాన్ని పేతురు ఉపయోగించాడు. ‘‘ఇల్లుకట్టువారైన ‘మీరు’ తృణీకరించిన రాయి ఆయనే’’ కట్టువారు అంటే కేవలం బేలుదారి పని చేసేవారని భావంకాదు. కట్టడపు బాద్యత కలవారని దాని అర్థం; నిర్మాణకులు కాంట్రాక్టర్లు వగైరా బాధ్యతలు కలవారని ఆ పదం సూచిస్తుంది. యూదామత సిద్ధాంతపు నిర్మాతలు వారే! వారివైపు పేతురు తన వ్రేలుచూపుతూ, ‘‘నాయకులైన మీరు మెస్సీయాను నిరాకరించారని’’ అన్నాడు.

ఆయన్ను గూర్చిన తప్పుడు భావాలవల్లనే వారు మెస్సీయాను నిరాకరించారు. మెస్సీయా గొప్ప ఆడంబరంగాను, సైన్యబలంతోను వచ్చి, తమ దేశంనుండి రోమీయులను తోలివేస్తాడనే భావంతో వారు ఎదురు చూచినట్లున్నారు. ఆయన యెరూషలేములో దావీదు సింహాసనాన్ని పునరుత్థరించి, దానిపై కూర్చుండి పాలిస్తాడనీ, దానితో పాలస్తీనా అంతటిలో దీవెనలు పొర్లిపారతాయనే ఆశను వారు కలిగినట్లున్నారు. యేసు వారిమధ్యకు వచ్చినప్పుడు, మెస్సీయాను గూర్చి వారు పెట్టుకున్న ఆలోచనలన్నిటికి బద్దవిరుద్ధంగా ఉన్నట్లు వారు కనుగొన్నారు. గనుకనే వారాయన్ను నిరాకరించారు. అదెలాగున్నా, వారు నిరాకరించిన యేసునే, దేవుడు దైవీకమైన తన పనికొరకు ‘‘మూలరాయి’’గా చేసికొన్నారు.

ఆ దినాల్లో భవన నిర్మాణంలో ‘‘మూలరాయి’’ బహు ప్రాముఖ్యంగా ఉండేది. వాస్తవంగా ఆ కట్టడంలో అది యొక ప్రధానమైన భాగం. అది పునాదిని స్థిరపరచడం మాత్రమే గాక, ఇరువైపుల నిర్మాణపు హద్దులను మూలరాయి స్థాపిస్తుంది.[8] మెస్సీయా తమకు అంతటి ప్రాముఖ్యమైనవాడని సూచించడానికిగాను, వారు మూలరాతికొరకు స్థలం వదులుతూ ఉండేవారట! వారి ఆచార వ్యవహారాలు ఎలాగున్నా, యేసు వచ్చినప్పుడు, వారు తమ మెస్సీయాకొరకు విడిచిపెట్టిన ఖాళీలో ఆయన యిమడ లేదు. పైగా, పరపక్ష ద్వేషబుద్ధితోను, ముందుగా ఊహించిన భావాలతోను వారున్నందున, యేసు వారి మధ్యకు వచ్చినప్పుడు సత్యానికే వారు భయంకరమైన శత్రువులుగా తయారయ్యారు.

## రక్షణ

పేతురు తన మాటలతో ఆ సభవారిని ‘‘ఎడాపెడా’’ కొట్టాడు. కడకు వారు దిమ్మరగొనిపోయే దెబ్బను వారిపై యిలా విసిరాడు, ‘‘మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణపొందవలెనుగాని, ఆకాశముక్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణపొందలేము’’ (12 వ.). గ్రీకులో ‘‘రక్షణ’’, ‘‘రక్షణపొందు’’ అనే మాటలు ‘‘బాగుపరచబడు’’ (లేక ‘‘స్వస్థత పొందు’’) అని అర్థమిచ్చే గ్రీకు మూలంనుండి వచ్చాయి (9 వ.). భిక్షగానిని

శరీరమందు స్వస్థపరచిన యేసే, మానవాళిని ఆత్మసంబంధంగా బాగుచేయగలరనే భావం యిందులో వ్యక్త పరచబడింది![9]

''మరి ఎవనివలనను రక్షణ కలుగదా?'' ప్రతిపాదన సంకుచిత బుద్ధితో చేయబడి నట్టు కన్పించినా, అది సత్యమే ''- నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు'' అని యేసు అన్నారు (యోహాను 14:6).[10] పేతురు ఆ భావాన్నే ప్రతిధ్వనించాడు. పేతురుయొక్క శ్రోతలు అబ్రాహాము సంతానమైనందు చేతను, మోషేధర్మశాస్త్రం తమకు కలిగి యున్నందు చేతను రక్షింపబడినట్టు భావిస్తున్నారు కాబోలు. పేతురు చెప్పినదాని భావమేమంటే: ''మీరు అబ్రాహాముద్వారా గాని, మోషేద్వారాగాని రక్షింపబడలేరు. మీరు యేసు నామముననే రక్షణ పొందగలరు!'' అయితేనేటి మత ప్రపంచం - నీవు మంచివ్యక్తివిగా జీవించినట్లయితే, వెయ్యిమార్గాల గుండా నీవు పరలోకానికి వెళ్లవచ్చునని చెప్పుతుంది. పేతురు తిరిగి ''లేదు''! ... ''యేసు నామముననే నీవు రక్షణ పొందగలవు!'' అని అంటాడు. సత్యం దాని స్వభావాన్నిబట్టి ఎల్లప్పుడును సంకుచితంగానే ఉంటుంది.[11]

''మనము'' అనే మాటను గమనించు: మనము అనే పదం తెలుగులో పొందలేము అనే పదంలో యిమిడియుంది. ''పొందలేము'' అంటే - మనము పొందలేమనే దాని భావం. ''మనము'' అనే పదం ప్రత్యేకంగా ఉపయోగింప బడనవసరంలేదు. ''మనలో ఎవడైనాసరే - జాలరియో, భిక్షగాడో, యాజకుడో, పెద్దో, శాస్త్రో, (దర్బారు)కోర్టు అధికారియో, మరియింకెవడో - మనలో ఎవడైనా రక్షింపబడాలంటే మాత్రం'' - అది కేవలం యేసుక్రీస్తు నామంలోనే జరగాలి! అన్నట్టు పేతురు తెలియజేశాడు.

దాన్నిబట్టి పేతురు చెప్పేమాటల తాత్పర్యమేమంటే - మత సంబంధమైన తన శ్రోతలు నశించారు అనే! ఈ గుంపుకు దేవుడు మరో తరుణం అనుగ్రహిస్తున్నాడని పేతురు సూచించాడు. కుంటివాడు దేహంలో బాగుపడినట్టు, సభవారు ఆత్మ సంబంధంగా స్వస్థతపొందవచ్చు: తరుణం యింకా మించిపోలేదు; యేసును నిరాకరించి, సిలువవేసింది - ''క్షమింపబడని పాపంకాదు.'' వారు ఆయనను మెస్సీయాగా అంగీకరించియుంటే, వారికి యింకా రక్షింపబడే అవకాశముంది. దేవుడు సర్వకృపానిధియైయున్నాడు.

## నిశ్శబ్దం

పేతురు మాటలు సభలోని వారిని నిశ్చేష్టులుగా చేసాయి! [ధైర్యము KJV; సాహసం NIV][12] ''వారు పేతురు యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు

విద్యలేని పామరులని గ్రహించి ఆశ్చర్యపడిరి'' (13 వ.). ''విద్యలేని వారు, సామాన్యులు'' అంటే, అపొస్తలులు మామూలు విద్యను పొందినవారుకూడా కారు (వారి రబ్బీలకుండే ప్రత్యేకమైన తర్ఫీదు అంతకంటే లేదు), సమాజంలో వారికి ఏ అంతస్థులేదు[13] గుర్తింపుపొందిన మతవ్యవస్థ మధ్య, పేతురు యోహానులకు ఏలాటి మర్యాదా లేదు! అయినా, అంత ధైర్యంగాను, అంతటి ఆత్మ విశ్వాసంతోను ఎలా మాట్లాడగలిగారు? డెబ్బై యొక్కమంది విద్యావంతులు మారుమాట మాటలాడ కుండేలా ఎలా చేయగలిగారు? చివరికి సభవారికి సమాధానం లభించింది: ''వారు యేసుతోకూడా ఉండినవారని గుర్తెరిగిరి'' (13b వ.). పేతురు యోహాను లెవరో వారికి యింతక మునుపు తెలియదని దాని భావంకాదు.[14] లేక, ఆ సభవారు వీరిని తొలిగా యేసు శిష్యులై యున్నట్టు తెలిసికొన్నారని దాని అర్థంకాదు. గాని, పేతురు, యోహానులు అంత ధైర్యంతో, నిశ్చయతతో మాట్లాడడానికి హేతువేమో తటాలున వారు గుర్తించారు. ఆ యిద్దరు మనుష్యులు వారు మాట్లాడినట్టు మాటలాడగలగడానికి కారణం - వారు ''యేసుతోకూడ ఉండడమే!'' యేసుతోకూడ ఉండడమనేది ఆ మనుష్యులకు ఏమి చేసిందో - ఆ సభవారు కనుగొన్నారు! ప్రభువైన యేసుతో వాగ్వివాదంచేసిన కొన్ని సంఘటనలు ఆ సభవారిలో కొందరికి గుర్తు వచ్చియుండ వచ్చు. ప్రభువైన యేసుకు కూడా మామూలు విద్యలేని మాట వాస్తవమే (యోహాను 7:15). అయినా, దైవతత్వశాస్త్ర సంబంధమైన వాగ్యుద్ధానికి వారాయనతో కలబడినప్పుడు, వారు బహుగా పరాజితులయ్యారు.[15] వారికి తత్తర పుట్టించిన లేక యిబ్బంది కలిగించిన సమయాలు వారి వెనుకటి అనుభవంలో ఉన్నాయి - ఇప్పుడు యేసు ఒక్కడేకాడు - ఆయన అనేకులలో విస్తరించి, విస్తరించిన వారియందుండి - సభవారి నోళ్లను మూయిస్తున్నారు! ఇది వారికెంతటి అవమాన కరమైన పరిస్థితియో!

సాతాను మనలను కష్టపెట్టినప్పుడు, మనం యేసుతోకూడ ఉన్నామో లేదో తేటగా తెలిసిపోతుంది. మన ఆలోచనలు స్వార్థపరమైనవిగా ఉంటే, రిక్తునిగా చేసికొని, తన్నుతాను తగ్గించుకొని, మరణము పొందునంతగా విధేయత చూపినవాని స్వభావాన్ని మనమింకా గ్రహించుకోలేనట్టే (ఫిలిప్పీ. 2:7-8). ఒకవేళ మన మనస్సులు భయముచేత నింపబడినవైతే - ''మీ హృదయములు కలవరపడనియ్యకుడి, దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి'' అన్న, ప్రభువు మాటలయొక్క భావమేమో మనం ఎన్నడూ అర్థం చేసికోనట్టే (యోహాను 14:1-2). పేతురు, యోహానులవలె మనము అద్భుతాలు జరిగించే ఆత్మచేత నింపబడకపోవచ్చు; గాని మనకు సహాయపడడానికి దేవుని[16] ఆత్మ మనతో కూడ ఉన్నాడన్న సంగతిని మనమెరిగి, అపొస్తలులవలె యేసుకు మనలను మనమే అప్పగించుకొన్నట్లయితే, మనంకూడ అపవాదియొక్క

అగ్నిబాణాలను ధైర్యంగాను, నిశ్చయతతోను ఎదుర్కొగలం (యాకోబు 4:7).

పేతురు మాట్లాడడం ముగించగానే వేదనకరంగా నిదానించడం జరిగింది. ''స్వస్థతపొందిన ఆ మనుష్యుడు వారితోకూడ నిలిచియుండుట చూచి యేమియు ఎదురుచెప్పలేకపోయిరి'' (14 వ.). అద్భుతం జరిగినట్లు వారికి తెలుసు (16 వ.). లేదనడానికి ఎవడితరమూ కాదు.

వారు ఎదురు చెప్పలేకపోవడమనేది - పునరుత్థానానికి బలమైన రుజువైయుంది. వచనం 10లో - పేతురుయొక్క ప్రధాన ప్రతిపాదనను తిరిగిచూడు: (1) సభలో నున్నవారే యేసును సిలువవేయించారు; (2) దేవుడు యేసును మృతులలోనుండి లేపారు; (3) పునరుత్థానుడైన యేసు తమయెదుట నిలిచిన వానిని స్వస్థపరచారు. యేసును సిలువవేయడంలో ఆ సభవారు తమ వంతును కాదనలేరు సరిగదా, ఆ మనుష్యుడు స్వస్థపడిన విషయాన్ని సహితం కాదనలేరు. గనుక దేవుడు యేసును మృతులలోనుండి లేపిన వాస్తవాన్ని కాదనడానికి వారివల్ల కానేకాదు!

క్రైస్తవ ఉద్యమం అప్పుడే ప్రారంభమై, భంగపరచబడగల బాల్యదశలో అది నిలిచి ఉంది, దాన్ని రూపుమాపడానికి, యేసు మృతులలోనుండి లేపబడలేదని వారి శత్రువులు రుజువుచేయగలిగితేనే చాలు. యేసుయొక్క మృతదేహాన్ని తెచ్చి వారి ముందర పడవేస్తే సరిపోతుంది. లేదా, ఆయన మృతదేహం ఏమయ్యిందో తార్కికమైన రుజువులు యివ్వగలగితేకూడ సరిపోతుంది.[17] అయితే వారు ఆ రెండింటిలో ఏ ఒక్కటీ చేయగలిగినవారు కారు. ఈ రోజుల్లో కొందరు పునరుత్థానం జరుగలేదని చెప్పడానికి ప్రయత్నిస్తున్న వారున్నారు. అది జరగలేదని చెప్పగలిగియున్నట్టయితే, పునరుత్థానం ప్రకటింపబడిన ఆ దినాల్లో ఉన్న సందేహ వాదులు, ఆ పని జరిగించి యుండేవారే! అయితే వారు చెప్పగలిగింది ఏమీలేదు! యేసు మృతులలో నుండి లేపబడ్డారని అపొస్తలులు ప్రకటించిన వర్తమానం ఎదురాడలేనంతగా ఆనాడు, దానికి వ్యతిరేకులైయున్న అధికారుల యెదుట స్థాపింపబడింది.

## ముగింపు

పేతురు తన పక్షాన్ని రుజువు చేసికొనడంలో, 8నుండి 14వచనాలవరకు తమ మాటలలో క్రీస్తును ఘనపరచాడు; తన ప్రవర్తనలోకూడా ప్రభువును ఘనపరచాడు. అపవాది మనకు కష్టాన్ని కలిగించినప్పుడు, అనుసరించడానికి యింతకంటె ఉత్తమమైన మాదిరిని నేను ఆలోచింపలేదు.

## దృశ్య సాధనాల సూచనలు

యూదులు యేసును మూలరాయిగా నిరాకరించడం అనేదాన్ని - బిల్డింగు యొక్క డ్రాయింగు బోర్డుమీద గీచి, మూలరాయికి ఎగుడు దిగుడుగా ఉన్న స్థలాన్ని దానిలో వదలిపెట్టు. ఎగుడు దిగుడుగా ఉన్న స్థలం - మెస్సీయానుగూర్చి వారి అపార్థాలను సూచిస్తుంది. మరోవైపు క్రమమైన ఆకారంలో ఉండే ఒక రాయి బొమ్మను గీయ్యి. ఈ రాయి యేసును సూచిస్తుంది. ఈ రాయి వదలిన స్థలంలోనికి సరిపోదు గనుక - అది నిరాకరించబడుతుంది - అని చెప్పు.

దీన్ని మరో రూపంగా ఉదహరించవచ్చు, చెక్కముక్కలో గుండ్రని రంధ్రాన్ని వేయించు. ఆ తరువాత నలుప్రక్కల చదరంగా ఉండే చెక్కను అదే సైజులో చేయించు. ఆ గుండ్రాన్ని యూదుల అపార్థాలను, చదరపు ముక్కను ''ప్రభువైన యేసు'' అను ఈ చదరపుచెక్క గుండ్రని రంధ్రానికి సరిపోదు గనుక అది నిరాకరింపబడినట్టు చూపి, వివరించు.

---

సూచనలు

[1]లూకా 12:11-12; మత్తయి 10:17-20 చూడు. ఈ వాగ్దానము అపొస్తలులకేగాని, సువార్తికులకు కాదు. నేను, నీవు మాత్రం ముందుగా సిద్ధపడవలసిందే. [2]తరువాత కాలంలో పౌలు సీలలు - ప్రార్థించుచుతూ, దేవునికి స్తుతిగానం చేస్తూ చెరసాలలో ఎలాగడిపారో (16:25), పేతురు, యోహానులు కూడా అలాగే గడిపియుండవచ్చు. [3]16:7 చూడు. పరిశుద్ధాత్మనుగూర్చి మాట్లాడడానికి యిదొకమార్గం. [4]''కుంటివానికి చూపబడిన దయనుగూర్చి'' - అని NIVలో వుంది. [5]''లోకమే దీన్ని తెలిసికోవాలని నేను కోరుతున్నా''నన్నట్టు అతడు తెలిపాడు. [6]అనేకమార్లు మనయొక్క కోర్కెలు ఆయన రాజ్యంయొక్క అవసరతలు పెనవేయబడి ఉంటాయి. మనమీద వచ్చిన దుష్ప్రచారం ప్రభునామానికి అవమానం కలిగించే పరిస్థితిగా మారితే తప్ప, వ్యక్తిగతంగా మనకేమి సంభవించుతుందనే విషయాన్నిగూర్చి లక్ష్యపెట్టనవసరముండదు. [7]మార్కు 12:10లో యేసు ఈ లేఖనాన్ని తనకు వర్తింపజేసికొన్నారు. అసలు సందర్భంలో, తృణీకరింపబడినరాయి ఇశ్రాయేలీయులను సూచిస్తుంది - జనములు వారిని తృణీకరించారు, అయినా వారు దేవునిచే ఉపయోగించుకోబడ్డారు. కాని, ఇశ్రాయేలీయులు దేవుని ఉద్దేశాలను నెరవేర్చలేకపోవడం తరచుగా సంభవించింది. అయితే అవన్నీ (క్రీస్తులో) మెస్సీయాలో ఫలభరితమౌతాయనే నిరీక్షణ ఉండేది. అందువలన, నేడు మాత్రమే కాదు, ఆనాడుకూడా - ఈ లేఖనభాగం మెస్సీయాకు సంబంధించినదిగానే భావించబడింది. [8]మనకున్న సాంకేతిక విద్యగాని, పరికరాలుగాని ఆ దినాల్లోలేవు. గనుక అప్పటికి యిప్పటికి కట్టడపు పద్ధతుల్లో వ్యత్యాసముంది. అందువలన, కొందరు తర్జుమాదారులు, దీనిని ''ముఖ్యమైన రాయి'' అని అన్నారు. రాతి కట్టడంలో ఒక ముఖ్యమైన (మూలరాయి) రాయి లేకుండా కట్టితే ఎలాగుంటుందో మనకు తెలుసు. [9]వేరొక మార్గంలో రక్షింపబడగలమని భావించే మతలోకానికి నేను దీనిని ప్రధానంగా sermon notesలో వర్తింపజేశాను. అయితే, ఈ మాటలు సంఘంలో ఉన్నవారికి కూడా అంతగానే వర్తిస్తాయని Richard Rogers అన్నాడు (Richard Rogers, The First Opposition, sermon preached at the Sunset church of Christ, Lubbock, Texas, n. d. మనం జాగ్రత్తగా ఉండనట్లయితే, క్రీస్తుమీద ఆధారపడే దానికి బదులు మన కార్యక్రమాలమీదను, మానవ సామర్థ్యంమీదను - నశించినవారిని మార్చడానికి ఆధారపడతాం. [10]గ్రీకులో ఈ సంగతికూడా నొక్కి చెప్పబడింది.

[11]రెండును రెండుతో కలిపితే, అది ఎల్లవేళ్లల నాల్గే ఔతుంది; అది ఎన్నడునూ ఐదుకానేరదు. సత్యమనేదికూడ అంత సంకుచితమైన స్వభావం కలిగియుంటుంది. [12]శిష్యులయొక్క బహిరంగ ప్రసంగాల్లో ''ధైర్యమనేది'' ప్రత్యక్షంగా

గోచరించింది (9:27-28; 13:46; 14:3; 18:26; 19:8; 26:26). ఆది సంఘంయొక్క ఎదుగుదలకు సహాయపడిన మరొక ''రహస్యమే'' యిది. [13]విద్యకు విలువున్నమాట వాస్తవమేగాని, దేవుని వాక్యాన్ని నమ్మకంగా బోధించడానికి మాత్రం డిగ్రీలే కావలసిన అవసరంలేదు. [14]యోహాను కయిపకు వ్యక్తిగతంగా ఎరుకైనవాడే (యోహాను 18:15-16). [15]మత్తయి 21:23-27; 22:15-46. ప్రభువైన యేసును ఆ సభవారు ఎలా భావించి వైఖరిని కనుపరచారో పేతురు యోహానులు తిరిగి దాన్నే చూచారు. [16]అపొ. 2:38పై ఉన్న Notes చూడు. [17]కావలివారు (యేసు సమాధియొద్ద) నిద్రిస్తుండగా, ఆయన శిష్యులు వచ్చి ఆయన దేహాన్ని ఎత్తుకొనిపోయారని గతంలో చెప్పిన హాస్యాస్పదమైన కథను తిరిగి ఆ సభవారు వల్లించకుండడం గుర్తింపదగిందే (మత్తయి 28:11-15). పుకారుగా ఆ కథ బాగానే పనిచేసింది; అయితే ఆ మహాసభవారు - దాన్ని చట్టబద్ధమైన రుజువుగా యిచ్చియున్నట్టయితే, పేతురు ''వారి ఉరికొయ్యమీద వారినే ఉరితీసియుండేవాడే'' (ఎస్తేరు 7:10ని పోల్చి చూడు)- కారణమేమంటే - కావలివారు నిజంగా (డ్యూటిలో) పని సమయంలో నిద్రపోయి ఉంటే, వారిని చంపివేయాలి (వారికి మరణశిక్ష విధించాలి) కాని బహుమానం యివ్వకూడదు (మత్తయి 28:11-15ను అపొ. 12:19; 16:27లతో పోల్చిచూడు).

